కథానిక

# "కల్యాణ కింకిణి"

పి. సరళాదేవి

నేను పల్లెకు వెళ్ళే బస్సెక్కాను. బస్సుకదల బోతూంది. ఇంతలో చెయ్యూపుకుంటూ తొందరగా నడచివస్తున్న ఓ యువకుణ్ని చూస్తూ కండక్టరు ఈలవేయగా డ్రైవరు బస్సు ఆపాడు. ఆ యువకుడు దగ్గరకు రాగానే "మీరెక్కండీ!" అన్నాడు కండక్టరు. వెంటనే డ్రైవరు వెనక్కు తిరిగి చూచి "ఓహో! మన రామంగారా!" అన్నాడు

ఆ యువకుడు బస్సెక్కగానే తన కెదురుగా ఉండే సీట్లో కూర్చోబెట్టుకున్నాడు కండక్టరు. బస్సు కదిలింది. వీళ్ళకి తెలిసిన వాడే నేమో అనుకున్నాను. నీటుగా పేంటు షర్టు వేసుకుని, నున్నగా క్రాపింగు దువ్వుకొని, అప్పుడప్పుడు జేబులోని కర్చీఫ్ తీసి మొగం తుడుచుకుంటూ, పొడుక్కు తగిన లావుగా, చామన చాయరంగుతో, నూనూగు మీసాలతో చూడ్డానికి ఆధునిక యువకులలాగానే ఉన్నాడు. చూస్తూ కూర్చున్నాను.

"ఎంతాకా ప్రయాణం?" అన్న కండక్టరు ప్రశ్నకు...

"మీకు తెలియదా ఏమిటి?" అనేసి నవ్వేశాడు.

కండక్టరు స్థిమితంగా తన సీట్లో కూర్చుని "అయితే మీ రింకా పెండ్లి చేసుకోనట్లేనా?" అన్నాడు.

పెండ్లనేసరికి అందరికీ కుతూహలం కలుగుతుంది. ఆ మాటలో ఏ మహత్తుందో గాని, అందరూ మాటలాపేసి చటుక్కున వీళ్ళప్రక్క తిరిగారు. దానికి జవాబుగా ఆ యువకుడు నవ్వి తల అడ్డంగా వూపాడు "మరి. మీ నాయనమ్మలు, అమ్మమ్మలు వూరుకున్నారా?"

"అబ్బో! వాళ్ళావూరుకునేది. చంపుతున్నారు.' అన్నాడాయువకుడు.

"బాగుంది. ఇతను పెండ్లి చేసుకోకపోతే మధ్య వాళ్ళకేమంట?" అన్నాడు డ్రైవరు బస్సు శబ్దాన్ని మించిన కంఠంతో.

"అలాగా అనుకుంటున్నావు వీళ్ళసంగతింకా తెలియనట్లుందే! ఈమధ్య నేంజరిగిందనుకున్నావు." మాట పూర్తికాకముందే అడిగాడు డ్రైవరు. "ఏంజరిగిందేమిటి?"

"మనవాడికి ఏపిల్లా నచ్చడంలేదు. ఏవో వంకలు పెట్టి అన్ని సంబంధాలను వెళ్ళగొడుతున్నాడు. తల్లి, తండ్రి, నాయనమ్మ, అమ్మమ్మ తదితరులంతా ఎంతో చెప్పారు. బోధించారు. కాని అవే వీడిబుర్ర కెక్కలేదు. వాళ్ళకు చెప్పి చెప్పి విసుగెత్తింది. ఇక లాభం లేదని ఒక ఎత్తువేశారు." బస్సు ధూళి ముక్కులోకెళ్ళిపోయి తుమ్ము రాబోతుంటే శ్రమపడుతున్నాడు కండక్టరు.

"ఆదేటోనమ్మా! ఈ కాలపు బుద్ధులు. లక్షణంగా పెళ్ళి చేస్తామంటే వద్దు పొమ్మంటారు. పెళ్ళి చేసుకున్నారా .. పెళ్ళాం చెంగొదల్రు" అందో ముసలమ్మ పక్కావిడతో.

"అవునమ్మా! పోయేకాలపు బుద్ధులు! మా మేనత్త కూతురు కొడుకోడున్నాడు. చూచిన పిల్లకంతా ముక్కొంకర, మూతొంకర అని లక్ష వంకర్లు చెప్పేవాడు. తెరిపి తెన్ను లేకుండా పిల్లల్ని చూసిచూసి ఆఖరికో నల్లకోతిని కట్టబెట్టుకొచ్చాడమ్మా! చదువుంటే, డబ్బులేదని, డబ్బుంటే అందం లేదని నానా తిప్పలుపెట్టి చదువు డబ్బు అందం లేని పిల్లని కట్టుకున్నాడు. ఏం చెప్పమంటావు?" అంటూ బుగ్గలు నొక్కుకుందావిడ.

"అయ్యోరాత! కలికాలమమ్మా కలికాలం! మావీధిలో మునసబుకి పెళ్ళీడుకొచ్చిన కూతురుంది. ఇంతలో ఓ దూరపు బంధువట వొచ్చి, 'వాళ్ళ వొదినకి వాడికి తగవులొస్తున్నాయి. ఉద్యోగం దొరికే వరకు మీఇంట్లో వుంచండి' అని చెప్పి తమ్ముణ్ణి వొదిలేసాడు. ఆ తమ్ముడ్ని అల్లుడిగా చేసుకుందామని మహా మురిసిపోయాడా మునసబు. పిండివంటల్తో భోజనాలు, ఫలహారాలు కాఫీలు జరిపించి రోజూ ఖర్చుకి ఓ ఐదో పదో

చేతులో పెడుతుండేవాడట. ఆ తమ్ముడు సుష్టుగా భోజనంచేసి, జల్సాచేసాడు. ఉద్యోగం దొరగ్గానే వెళ్ళిపోయి, 'నీకూతురు నాకక్కరలేద'ని రాసాడుట. ఇలాగుందమ్మా న్యాయం!" అంటూ మొగంమీది చెమట తుడుచుకుందా ముసలమ్మ.

"ఇంక ఆపండమ్మా!" అన్నాడు ఆ యువకుడి ప్రక్క కూర్చున్న యువకుడు, కండక్టరు వైపు తిరిగి చెప్పమన్నట్టుగా చూస్తూ...

ఈ ముసలమ్మలను చూస్తూన్న వారంతా మొగాలటు తిప్పారు. నేను వెనక్కు పరుగెడుతున్న పచ్చని చేలని చూస్తూ వీళ్ళమాటలు వింటున్నాను. "చెప్పవోయ్" అని డ్రైవరు కేకవేయగానే కండక్టరు మొదలుపెట్టాడు.

"ఆమధ్య ఓరోజు వాళ్ళ మేనమామ వచ్చాడుట. 'ఒరే బాబూ! మీ అమ్మమ్మకు చాల జబ్బుగా వుంది. నిన్నొకక్కసారి తీసుకురమ్మందిరా' అన్నాడు. అయితే మనవాడి కనుమానం వేసింది. ఇలా తీసుకెళ్ళి కాళ్ళు చేతులు కట్టేసి పెళ్ళి చేసేస్తారేమోనని భయం వేసింది. వెళ్ళడానికి నచ్చక ఏవేవో సాకులు చెప్పాడు. 'ఏమిరా నామీద అంత నమ్మకంలేదా? ఒక్కసారి వచ్చి చూడు నా మాట అబద్ధమయితే వెంటనే తిరిగి వచ్చేద్దువుగాని' అంటూ బ్రతిమలాడి బస్సెక్కించాడు మేనమామ."

ఎవరో చెయ్యూపుతూంటే బస్సాపాడు. వాళ్ళెక్కగానే స్టార్టుచేసి వెనక్కు తిరిగి చెప్పమన్నట్టు చెయ్యూపాడు. ప్రయాణీకులందరూ వాళ్ళ మొగాలు చూస్తూ కూర్చున్నారు.

"అమ్మమ్మ ముసిల్ది కావటం వలన ఎప్పుడూ ఒక్కలానే ఉంటుంది. ఇద్దరూ ఇంట్లోకి వెళ్ళారు. ఆ ఇంట్లో ఓ పదిమంది ఆడవాళ్ళూ, ఓ పదిమంది మగవాళ్ళూ ఉన్నారు. గుండె గుభేల్ మంది మనవాడికి.

"వచ్చావురా నాయనా! ఆ వెంకటరమణుడి దయ."

"ఆ మూడుముళ్ళూ పడిపోతే సత్యనారాయణ వ్రతం చేయిస్తా."

"ఇంతింత కళ్ళూ...అదీ...మీనాక్షి కేమిరా మధురమీనాక్షిలాగుంటుంది."

"పెద్దింటి పిల్ల. మనమంటే పడిచస్తారు. ఇంతో అంతో ముట్టజెపుతారు; ఇంకేం కావాలి?"

ఇలా తలోమాటలంటూ మనవాడ్ని చుట్టుముట్టేశారు. ఆతగాడి అనుమానం నిజమయిపోయింది. ఎలాగైనా మెప్పించి మీనాక్షిని చేసేయాలన్న వాళ్ళ సంకల్పం మనవాడికి తెలిసిపోయింది. అయితే ఏం? ఇవంతా చూచి మనవాడు బేజారయిపోయి దారీతెన్నూ తోచక మొగం వేలవేసాడు. మనవాడి కేమీ తోచలేదు. ఆ మీనాక్షిని రెండుమూడుసార్లు చూడ్డం తటస్థించింది. ఆ మీనాక్షిని చేసుకునేకంటే ఏ నుయ్యో గొయ్యో చేరుకుంటే మంచిదని మనవాడి అభిప్రాయం. కాళ్ళూ చేతులూ ఆడలేదు.

"మీరలా గుండయిపోకండి. నేను పెళ్ళి చేసుకోనన్నానా ఏమిటి? నచ్చిన పిల్ల దొరికితే తప్పకుండా చేసుకుంటాను. మీరు చెబుతున్నారు కదూ-ఆ పిల్ల బావుందని. చూద్దాం. మరి ముందు నన్ను స్థిమితపడ నివ్వండి. మూడు రోజుల్నించీ వంట్లో బాగులేదు. చెబుతున్నా వినకుండా మామయ్య లాక్కొచ్చాడు. స్నానం, భోజనం కానివ్వండి" అని అప్పటికి తప్పించుకున్నాడు.

ఎక్కడ తప్పించుకు పారిపోతాడోనని వెయ్యి కళ్ళతో కాపలా కాస్తున్నారు. ప్రతి ద్వారం దగ్గరా మనుషులుండి, అత నెక్కడికి వెడితే అక్కడకంతా వెంటబడుతూ చెబుతున్నారు.

వీళ్ళ ధోరణంతా చూస్తూంటే, ఆ పిల్లను చేసుకుంటాను అని పత్రం రాసిచ్చేవరకూ వదిలేటట్టు కనిపించలేదు. ఈ ఊబిలోనుంచి బయటపడట మెలాగా? అని ఉపాయాలు వెదకుతున్నాడు. వాళ్లు చెబుతున్నవన్నీ వింటూ ఆలోచిస్తున్నాడు. దేముడికి కూడా పక్షపాతమే! అవసరం లేనప్పుడు ఎంత బుద్ధయినా ఇస్తాడు, అవసరమయినప్పుడు జ్ఞానమంతా దోచేస్తాడో ఏమిటో!

బెంగపట్టుకుంది. పిల్లను చూచి వద్దాం. తరువాత ఆలోచించొచ్చు అనుకుని-మధ్యాహ్నం కాఫీలవగానే "నేను మొగం కడుక్కుని బట్టలు వేసుకుంటాను. మీరు కూడా తయారవండి. పిల్లను చూద్దాం" అన్నాడు. వాళ్ళందరూ ఉబ్బిపోయి లక్ష దీవెన లిచ్చారుట అపేసి ఆయాసం తీర్చుకుంటున్నాడు కండక్టరు.

"మనవాడు మీనాక్షిని పెండ్లిచేసుకుంటాడా? లేకపోతే తప్పించుకుంటాడా? ఎలా తప్పించుకుంటాడు? మా వెండితెరమీద చూడండి" అనేసి పకపకా నవ్వాడు కండక్టరు.

ప్రయాణీకులంతా విసుక్కున్నారు — కాలం వ్యర్థం చేస్తున్నందుకు. ఒక్కొక్కరి మూడ్స్ చూస్తూంటే నాకు నవ్వొచ్చింది. రుమాలు నోటికడ్డం పెట్టుకుని-జపాను పద్ధతిగా నాటిన పచ్చని వరిపొలాలను చూస్తూ కూర్చున్నాను.

"నీ హాస్యం మండిపోనూ! చెప్పవోయ్!" కసుమన్నాడు డ్రైవరు.

"మనవాడు మొగం కడుక్కోవడానికి పెరట్లోకి వెళ్ళాడు. ఇతని మాటలకి ఉబ్బిపోయారేమో. అతని వెనక పెరట్లోకి వెళ్ళడం మరచిపోయారు. పెరట్లోకి వెళ్ళి చూచాడు, ఎవరూ వెనక రాలేదు. 'బ్రతికానురా బాబూ!' అనుకుని, వేపచెట్టెక్కి, పెరటిగోడమీదికి దిగి, రోడ్డుమీదికి గంతేసి బస్‌స్టాండుకు పరుగుచ్చుకున్నాడు. దేవుడి దయవల్ల సమయానికి బస్సుందేమో! చల్లగా ఇంటికి చేరుకున్నాడు." అని విరగబడి నవ్వడం మొదలెట్టాడు కండక్టరు.

ఆ యువకుడూ, డ్రైవరు, ప్రయాణీకులూ అందరూ నవ్వుతున్నారు. ఆ నవ్వులో 'ఆఁ!' విస్తుపోయిన ముసలమ్మల నెవ్వరూ గమనించలేదు.

కొంతసేపు సద్దుమణిగిన తరువాత ఆ యువకుణ్ణి చూస్తూ "మా వీధిలో ఒకమ్మాయుంది. ఎస్. ఎస్. ఎల్. సి. చదువుతోంది. పిల్లయితే బాగానేవుంది కాని ... నచ్చుతుందో నచ్చదో..." నసిగాడు కండక్టరు.

"ఆఁ మనవాడికి ఏం తక్కువొచ్చిందోయ్... నచ్చకపోవడానికి. కాలేజీల్లో చదువుతున్న ఏ స్టూడెంటుకి తీసిపోతాడోయ్!" అందుకున్నాడు డ్రైవరు.

"వేషంలో తీసిపోడనుకో...అయినా..."

"ఇంకేమి అంటావు? ఓబ్బా-వాళ్ళిద్దరికీ లోటుండదు. అందమూ, ఇతడిదగ్గర నాగేశ్వర్రావు బలాదూర్!" తుక్కురేపేశాడు డ్రైవరు. ఉబ్బిపోయాడు మనవాడు. నివ్వెరపోయాను నేను.

"అది కాదు, చదువురాదుకదూ! అందుకే ఆ పిల్ల నచ్చుతుందో నచ్చదో!"

"ఆఁ ఇప్పటి ఎస్. ఎస్. ఎల్. సి. వాళ్ళకి ఆ మాత్రం చదువొస్తోందో చూస్తున్నాంగా. ఏ మాత్రం ఇంగ్లీషుముక్కలు మనవాడికీ తెలుస్తాయి. అందానికా అందం. డబ్బుకా లోటులేదు. ఇంతకంటే మంచి సంబంధం ఎక్కడొస్తుందోయ్ ఆ పిల్లకి?" మగ పెళ్ళివారి తరఫున వకాల్తాపుచ్చుకొని మాట్లాడుతున్న డ్రైవర్ని చూస్తూంటే, కొంపదీసి కట్నంకూడా తేల్చేస్తాడేమో అనుకున్నాను.

"చదువుకున్న పిల్ల చదువుచూస్తుందిగాని డబ్బు అందం చూస్తుందా? పోనీ. ఆ పిల్ల మాట్లాడిన రెండుమూడు ఇంగ్లీషు ముక్కలయినా అర్థం చేసుకోవాలా?"

"ఓస్. ఆ మాత్రం ఇంగ్లీషు ముక్కలే అర్థం చేసుకోలేడా? అడుగు చూదాం. ఫార్టీ అంటే ఎంతోయ్!" పౌరుషంతో అరిచాడు డ్రైవరు. చచ్చాడు ఆ 'మనవాడు.' మొగం కాస్త కందిపోయింది. మాట్లాడకుండా తలకిందికి దించుకుని వూరుకున్నాడు.

"చెప్పవోయ్! ఫార్టీ అంటే ఎంతోయ్" కండక్టరు హెచ్చరించాడు.

"నలభై" అన్నాడాయువకుడు మెల్లిగా.

"ఆఁ ఇప్పుడేమంటావు" అన్నాడు గర్వంగా డ్రైవరు.

"కుక్కలు కూడా లెక్కలు చేస్తున్నాయట. అదీ ఓ గొప్పే? ఏదీ. పెద్దమాటలు చెప్పమను చూద్దాం. అయినా ఇంగ్లీషుకోసే తెల్లవ్వారిందా, హిందీ రావొద్దూ"

"అంతేనా? సంస్కృతం రావొద్దూ? తమిళం రావొద్దూ. నీ తలకాయ రావొద్దూ?" ఒళ్ళుమండిపోయిందేమో కసి తీరా అనేశాడు డ్రైవరు.

"అతగాడి నంటేనే నీ కెందుకంట—కందకు లేని దురద కత్తిపీటకని-"

వాదనలా పెరిగిపోతోంది. పల్లెవచ్చేసింది. ఎవరో ఆ యువకుడి విషయంలో తగువులుపడుతూన్న డ్రైవర్నీ, కండక్టర్నీ చూస్తూంటే నవ్వు ఉప్పెనలా పొంగి వస్తోంది. ఆ వాదనంతా చివరంటా వినలేదని విచారపడుతూ, అంత త్వరగా పల్లె వచ్చేసినందుకు కోప్పడేసి. బస్సుదిగి నడక సాగించాను. ★